క్లుప్తంగా

ఆదోని డీఎస్పీగా సోమన్న



ఆదోని అర్బన్: ఆదోని డీఎస్పీగా సోమన్న ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు సీఐడీ శాఖలో డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఆదోనికి వచ్చారు. ఇక్కడున్న డీఎస్పీ శివనారాయణస్వామి పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. సోమన్న గతంలో తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేశారు. డీఎస్పీ మాట్లాడుతూ మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు జిల్లాపై తనకు పూర్తి అవగాహన ఉందని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆదోని అర్బన్: శ్రావణమాసం సందర్భంగా పట్టణ శివారులోని రణమండల కొండలో వెలిసిన ఆంజనేయస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుడు టి.జి. పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి సభ్యులు స్వామివారికి వేకువజామున ఫల పంచామృతాభిషేకం, సిందూరసేవ, తులసీహారం, ఆకుపూజ, బెంగళూరు నుంచి తెచ్చిన వివిధ రకాల పుష్పాలతో అలంకరణ, మహామంగళహారతి గావించారు. ఆదివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు సమితి సభ్యులు అన్నదానం చేపట్టారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లికివందనం విద్యార్థులకు ఇస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి ప్రకటించడం హర్షించదగ్గ విషయమే అయినా ఆ పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని, తల్లికి వందనం ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపజేస్తే భవిష్యత్‌లో సర్కారు స్కూళ్లు మూతపడే ప్రమాదం వుందన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, బాబయ్య, అడివన్న, ఎల్లప్ప, వెంకట్రాముడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రౌడీ షీట్ ఉన్నవారు తమ పద్ధతి మార్చుకొని జీవనం సాగించాలని తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు సృష్టించకుండా శాంతియుతంగా ఉండేల చూడాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైన వదలిపెట్టేది లేదని హెచ్చరించారు. అనుమానితులు, నాటుసారా, అక్రమ మద్యంపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఈరన్నస్వామి గిరి బృందావన ప్రదక్షిణ



ఈరన్నస్వామి గిరి ప్రదక్షిణ చేస్తున్న ఆంజనేయస్వామిమాలధారులు, భక్తులు

ఆదోని రూరల్: మండల పరిధిలోని విరుపాపురం గ్రామంలో ఆదివారం శ్రీ ఈరన్న గిరి బృందావన ప్రదక్షిణ నిర్వహించారు. ఇందులో పలువురు భక్తులు పాల్గొన్నారు. భక్త మహాసేన ఆంజనేయస్వామి మాలధారణ గావించిన గురుస్వామి నాగరాజుస్వామి, విశ్వహిందూ పరిషత్ వైస్ ప్రెసిడెంట్ తలారి ఆంజనేయస్వామి తదితరులు దైవసేవలో పాల్గొన్నారు. అలాగే సత్యనారాయణ కిరాణ, జనరల్ స్టోర్ శివయ్య, సైకాలజిస్టు డాక్టర్ ప్రశాంత్, రామకృష్ణ, విజయ్, బసవరాజు, విరుపాపురం పెద్దలు ఈరన్న, చిన్న రంగన్న, హనుమంతు, లక్ష్మీకాంత్, గోనబావి మాజీ సర్పంచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో 'తట్టా' రాజకీయం

- హారతి పళ్లెం తీసెయ్యాలని తెలుగు తమ్ముళ్ల హుకుం
- ఈవో సెలవుకు ఇదొక కారణమే!



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

మంత్రాలయం : పవిత్ర పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న సన్నిధిలో హారతి తట్టా రాజకీయం రంజుగా సాగుతోంది. టీడీపీ తమ్ముళ్లు వర్గాలుగా వీడి అర్చకుల తట్టాపై విరుచుకుపడుతున్నారు. తట్టా తంటాలో డిప్యూటీ కమిషనర్ సైతం బలిపశువు అయ్యారన్నది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో ఆదివారం తట్టాపై కొందరు తమ్ముళ్లు హుకుం జారీ చేశారు. తట్టాను తీసెయ్యాలని పట్టుబట్టినట్లు సమాచారం. ఇంతకు తట్టా రాజకీయం క్షేత్రంలో దుమారం రేపుతోంది.

డీసీ నిర్ణయంతో హారతి పళ్లెంకు స్వస్తి

వాస్తవంగా దేవాదాయ శాఖ పరిధిలోని ఏ ఆలయంలోనూ హారతి పళ్లెం సంస్కృతి లేదు. ఇక్కడ మాత్రం ఏళ్లుగా అర్చకులు హారతి పళ్లెం పెడుతున్నారు. వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నా హారతి ఆదాయం వదులుకోవడంలేదు. గతంలో ఏ అధికారి అర్చకుల తట్టా జోలికి పోలేదు. మార్చి 8వ తారీఖున బాధ్యతలు చేపట్టిన గత డిప్యూటీ కమిషనర్ హెచ్.జీ. వెంకటేష్ హారతి పళ్లెం పద్ధతిని నిలిపివేశారు. ఆయన ఉన్నన్ని రోజులు అర్చకులు హారతి పళ్లె చేత బట్టలేదు. అయితే అనుకోని పరిణామాల మధ్య ఆయన సెలవుపై వెళ్లారు. వెళ్లిన మరుసటి రోజు నుంచే క్షేత్రంలో అర్చకులు తట్టాను చేత బూనారు. భక్తుల విరాళాలు తమ వశం చేసుకుంటూ ఆలయ ఆదాయానికి ఎసరు పెడుతున్నారు. ప్రస్తుతం వచ్చిన డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తట్టాపై నోరు మెదపడం లేదు. పాత డీసీ వెంకటేష్ సెలవుపై వెళ్లడానికి ఈ తట్టా కూడా ఓ కారణమి తెలుస్తోంది.

తట్టాపై సాగుతున్న రాజకీయం

హారతి తట్టాపై టీడీపీ వర్గాలు రాజకీయం చేస్తున్నాయి. తట్టా కోసమే అర్చకులు అమ్యామ్యాలు ఇచ్చుకుని డీసీని తప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఆశీస్సులతోనే తట్టా సంస్కృతికి ఆజ్యం పోశారని మాధవరం రాఘవేంద్రరెడ్డి వర్గీయులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాఘవేంద్రరెడ్డి వర్గీయులు తట్టాను తొలగించాలని అర్చకులకు హుకుం జారీ చేశారు. గ్రామ నాయకుల నిబంధనల మేరకు హారతి పళ్లెంను తీసెయ్యాలని పట్టుబట్టారు. ఈ విషయమై మంతనాలు సైతం నడుస్తున్నాయి. ఏదీ ఏమైనా తట్టా తంటాతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తట్టాను తీసెయ్యమని చెప్పలేక.. పెట్టుకోండని సూచించలేక రాజకీయ రాట్నంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఏదీ ఏమైనా ఈరన్న స్వామి తట్టా ఇంత తంటా తీసుకురావడం చర్చనీయాంశం.



ఉరుకుంద క్షేత్రం

ఉన్నట్టా.. లేనట్టా.?

మంత్రాలయం: ఓ వైపు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఉత్సవాలు.. మరో వైపు భక్తుల ఏర్పాట్లు.. ఇంకో వైపు అధికార గణాన్ని సమాయత్తం చేసే పనులు.. ఇన్ని ఉన్నా ఉలుకూ పలుకూ లేదు. బాధ్యతలు తీసుకుని వారం గడిచినా ఆలయ శాఖాపరమైన ఫోన్ నంబర్‌ను తీసుకోలేదు. కనీసం ఫోన్ కాల్‌కు అందుబాటులోకి రారు. ఇదీ ప్రస్తుత ఉరుకుంద ఈరన్న ఆలయ డిప్యూటీ కమిషనర్ తీరు. భక్తులు సమస్యలపై గగ్గోలు పెడుతున్నా పట్టీపట్టన్నట్లు నడుచుకుంటున్నారు. ఆయన తీరుపై ఇటు అధికారులు, భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏ నంబర్లో అందుబాటులో ఉంటారో?

ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో నెల రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈనెల 5వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. నాటకీయ పరిమాణాల మధ్య ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కమిషనర్ 3వ తేదీ సెలవుపై వెళ్లారు. వెనువెంటనే ఆలయ డీసీగా పి.గురుప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. 4న ఇక్కడకు వచ్చిన బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ శాఖ ఆలయ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్‌కు 9491000738 నంబర్‌ను కేటాయించారు. అయితే బాధ్యతలు చేపట్టి వారం గడిచినా సదరు నంబర్‌ను ఆయన తీసుకోలేదు. డీసీ సంప్రదించాలంటే ఏ నంబర్లో అందుబాటులో ఉంటారో ఎవరికీ తెలియదు. అదొక రహస్యంగా సాగిపోతున్నారు. నంబర్ ఎక్కడ ఉందా.. అని సాక్షి విచారించగా ఆలయ నంబర్‌ను ఓ సూపర్‌వైజర్ దగ్గర ఉంచారు. ఎంతటి వారు ఫోన్ చేసినా.. ఏ అవసరం వచ్చి కాల్ చేసినా జవాబు లేదు. ఫోన్ రింగు అయినా ఫోన్ రిసీవింగ్ ఉండదు. దీంతో అధికారులు మొదలుకుని భక్తులు తలలు పట్టుకుంటున్నారు. బాధ్యత స్వీకరించినా ఎందుకు ఫోన్ నంబర్ వినియోగించడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

కోసిగిలో ట్రాఫిక్ జామ్



కోసిగిలో నిలిచిపోయిన వాహనాలు

కోసిగి: కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో కొలువుతీరిన ఈరన్న స్వామి శ్రావణ మాస ఉత్సవాలకు భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం కోసిగి మీదుగా ఉరుకుంద క్షేత్రానికి వేలాదిగా వాహనాలు తరలి వెళ్లాయి. కర్నూలు జిల్లాల నుంచే కాక కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు, మాన్వి, గుల్బార్గా, యాదిగిరి, తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల, మహబూబ్ నగర్ జిల్లాల నుంచి ప్రజలు అత్యధికంగా తరలి వస్తున్నారు. కోసిగి నుంచి జుమ్మాలదిన్నె మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే సింగిల్ రోడ్డు కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోసిగి రైల్వే గేటు వద్ద ఒక సారి గేటు పడితే దాదాపు పదిహేను నిమిషాలు గేటు పడుతుంది. ఒక్కసారి గేటు పడితే వాహనాలు ఇరుపక్కల కిలో మీటర్ పై గా వాహనాలు నిలిపోయాయి. వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి ఎటూ వెళ్లాలేక గంటల కొద్ది వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేడు శ్రావణ మాసం రెండవ సోమవారం కావడంతో వాహన రాకపోకలు పెరిగే అవకాశం ఉందని, అధికారులు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు.

కూచిపూడి నృత్యంలో చిన్నారుల ప్రతిభ



కూచిపుడి నృత్యం చేస్తున్న ఆదోని చిన్నారులు

ఆదోని అర్బన్: నంద్యాల పట్టణంలో కళారాధన సంస్థ వారు నిర్వహించిన రాయలసీమ స్థాయి సాంస్కృతిక ఉత్సవాల్లో శనివారం రాత్రి శాస్త్రీయ నృత్య పోటీలు జరిగాయి. ఇందులో ఆదోని పట్టణంలోని శ్రీగురు కృప కూచిపూడి నాట్యాలయ చిన్నారులు ప్రతిభ కనబరిచారు. జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి రూపాల్ సాయిశ్రీ, ద్వితీయ బహుమతి సుకృతి, స్పెషల్ జ్యూరీలో మాన్విశ్రీ, స్నేహిత గెలుచుకున్నారు. అలాగే సబ్ జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి ఆర్. జాహ్నవి, తృతీయ బహుమతి ధరణి, స్పెషల్ జ్యూరీలో మనోజ్ఞ గెలుపొందారు. సీనియర్ విభాగంలో స్పెషల్ జ్యూరీలో దివ్యశ్రీ, రామతులసి, సురేఖ గెలుచుకున్నారు. గ్రూప్ విభాగంలో సురేఖ, మహతి, స్నేహిత, మాన్విశ్రీ గ్రూప్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. నాట్యాలయ గురువు వీరజ్‌రాయల్ మాట్లాడుతూ సాంస్కృతిక ఉత్సవాల్లో తమ విద్యార్థులు 15 మంది పాల్గొనగా 14 మంది బహుమతులు పొందారని చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సీఐ బీవీ విక్రమసింహా, ఎస్ఐ తిమ్మయ్య

నందవరం : అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ బీవీ విక్రమ సింహా తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ మాట్లాడుతూ..నందవరం మండల పరిధిలో ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాగలదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. తెలంగాణ రాష్ట్రం అయిజ మండలం పులికల్లు గ్రామానికి చెందిన తెలుగు సుంకన్న కర్ణాటక మద్యాన్ని బైక్‌పై తలిరలిస్తుడంగా పట్టుకున్నారని చెప్పారు. అలాగే కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా తలమారి గ్రామం నుంచి కర్ణాటక మద్యాన్ని నందవరం మండలంలోని కనకవీడు గ్రామానికి చెందిన బోయ తాయన్నకు తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నారన్నారు. 960 ఒరిజినల్ చాయిస్ విక్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లను, బైకును స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

దేవాలయాల ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ రాష్ట్రాధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

ఆదోని అర్బన్: రాష్ట్రంలోని దేవాలయాలు వాటి ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్రాధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు 3, 4వ తేదీల్లో తిరుపతి జిల్లాల్లో వరదపయ్యపాలెంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశామన్నారు. ధర్మపరిరక్షణకు ఉద్యమాలు చేసిన వివిధ ధార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులపై అక్రమంగా పెట్టిన కేసులను తక్షణమే ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎత్తి వేయాలన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక

గోనెగండ్ల : ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాం చదువులమ్మ చెట్టు నీడలో అన్నాడో సినీ కవి. ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల కిందట కలిసి చదివారు. అనంతరం ఉన్నత చదువుల కోసం విడిపోయారు. విద్యాభ్యాసం తర్వాత ఉద్యోగాలు, సంసార జీవననంలో ఏళ్లు గడిచిపోయాయి. తిరిగి నాటి స్నేహితులతో కలవగానే పిల్లలుగా మారిపోయారు. ఆనందాలు, ఆశ్చర్యాలు, ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఇందులో భాగంగా నాడు తమకు చదువులు చెప్పిన గురువులు వెంకట రమణ, విష్ణువర్ధన్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కృష్ణయ్య, రాఘవరెడ్డి, విజయ కుమారి, జ్యోతి, బేగం, హుసేన్ పీరా, మహబూబ్ బాషా, నారాయణ, అబ్దుల్ ఖాదర్, అన్వర్, రమేష్, అనీఫ్, శేఖర్‌లను పూర్వ విద్యార్థులు సన్మానించారు. నాడు పాఠశాలలో గడిపిన సంఘటనలను నెమరు వేసుకుంటూ ఆట పాటలతో గడిపారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో మార్పు

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలను మార్పు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ రాఘవేంద్ర రావు ఆదివారం తెలిపారు. గూడూరు 132 కేవీ నుంచి 220 కేవీలో కార్పొహైడేట్ సబ్‌స్టేషన్ వరకు కండక్టర్లు మార్చుతున్నందున సబ్‌డివిజన్ పరిధిలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల్లో వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరా వేళలను మార్చుతున్నామన్నారు. త్రీఫేస్ సప్‌లైలో రాత్రి మూడు గంటలు, పగలు 6 గంటలు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

కోసిగి: మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో నేటి నుంచి 20 రోజుల పాటు మార్పులు ఉంటాయని ట్రాన్స్ కో ఏఈ వీరేష్ ఆదివారం తెలిపారు. పగటి సమయంలో 5 గంటలు, రాత్రి సమయంలో 4 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 20 రోజుల తర్వాత పాత పద్ధతిలోనే విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమస్య పరిష్కరించండి



మూలన పడ్డ క్లాప్ వాహనాలను చూపుతున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరించే క్లాప్ వాహనాలు మూలన పడిపోవడంతో తమకు ఉపాధి కరువైందని, తమ సమస్యను పరిష్కరించాలని వాహన డ్రైవర్లు సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడు కోరుతున్నారు. క్లాప్ వాహనాల నిర్వహణకు నిధులు మంజూరు కాకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. అవి మూలన పాడటంతో డ్రైవర్లకు ఉపాధి కరువైందని, గత జూలై 10వ తేదీన స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చినా నేటికి సమస్యపై వాహన డ్రైవర్లతో కానీ, క్లాప్ వాహనాల గురించి కానీ చర్చించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరునెలలుగా ఉపాధి, వేతనాలు లేక తాము అవస్థలు పడుతున్నామని వాహన డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను సత్వరం పరిష్కరించి పట్టణంలో క్లాప్ వాహనాలను తడి, పొడి చెత్త సేకరణకు ఉపయోగించి డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

నందవరం: పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు తప్పక హాజరు కావాలన్నారు. గ్రామాలలో చేపట్టాల్సిన పారిశుద్ధ్యం, వీధి లైట్ల నిర్వహణ, చెత్త సంపద తయారీ కేంద్రం నిర్వహణపై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు.

పదోన్నతుల తర్వాతే సర్దుబాటు చేయాలి

ఆదోని సెంట్రల్: పదోన్నతులు ఇచ్చిన తర్వాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న కోరారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ జీఓ నంబర్. 117 ప్రకారం కాకుండా జీఓ నంబర్. 53 ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజినేయులు, నాయకులు అంజినయ్య, వెంకటేశ్వర్లు, భాస్కర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నాగలదిన్నె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర

నందవరం: తుంగభద్ర డ్యామ్‌లోని 19 గేట్ తెగిపోవడంతో అన్ని గేట్లు ఎత్తి నీరు వదిలారని, నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని నదికైరవాడి, గంగవరం, జోహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, గురజాల, నాగలదిన్నె తదితర గ్రామాలలో రెవెన్యూ అధికారులు దండోరా వేయించారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాక్షి మీడియాతో మాట్లాడుతూ..తుంగభద్ర డ్యామ్‌లోని 19వ గేట్ చెయిన్ లింకు తెగిపోవడంతో డ్యామ్ నుంచి దాదాపు లక్ష క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారని వివరించారు. నది తీర ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండి తమ విద్యుత్ మోటార్లను ఒడ్డుకు చేర్చుకోవాలని సూచించారు. పశువుల కాపర్లు నది తీరం వైపు వెళ్లకూడదన్నారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



పట్టణంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: కేరళ రాష్ట్రం వయనాడ్‌లోని వరద బాధితుల కోసం సీపీఎం నాయకులు ఆదివారం పట్టణంలో విరాళాలు సేకరించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు మాట్లాడుతూ వయనాడ్ జిల్లాలో కొండచెరియలు విరిగి వరదలతో వందలాదిమంది మృత్యువాత పడ్డారన్నారు. అనేక మంది గల్లంతయ్యారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించి పూర్తి స్థాయిలో సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఏపీ రైతు సంఘ నాయకులు అబ్దుల్లా, లక్ష్మినర్సయ్య, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి సూచించారు. 'భారత వ్యవసాయ పరిశోధన మండలి'లో తయారైన 109 కొత్త రకం వంగడాలను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అంకితం చేసిన కార్యక్రమాన్ని ఆదివారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రైతులకు చూపించారు. ఆయన మాట్లాడుతూ 109 వంగడాలలో వివిధ ధాన్యపు గింజలు, నూనె గింజలు, పప్పు దినుసులు, చెరుకు, పత్తి, కూరగాయలు తదితర పంటలను మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుగుణంగా శాస్త్రవేత్తలు రూపొందించారని చెప్పారు. సమావేశంలో శాస్త్రవేత్తలు డా.మౌనిక, డా.చందన తదితరులు పాల్గొన్నారు.

దేవరగట్టులో శ్రావణమాస పూజలు

హొళగుంద: దేవరగట్టులో శ్రావణమాసం మొదటి ఆదివారంలో భాగంగా మాళమల్లేశ్వరస్వామి మూలమూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఆలయంలో రుద్రాభిషేకతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూల విరాట్లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, రుద్రాభిషేక, భండారార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి గావించి భక్తులకు తీర్థ ప్రసాదాన్ని అందజేశారు. సింహాసన కట్ట ముందు నెరణికి భక్తులు డోలు వాయిస్తూ తమ భక్తిని చాటుకున్నారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆర్డీఎస్ కరకట్ట పటిష్టతకు మట్టి తరలింపు



ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్న తుంగభద్ర నది

- ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఏర్పాట్లు



జేసీబీతో కరకట్టకు మట్టి వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: రాజోలి బండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆనకట్ట వద్ద కుడిగట్టు కరకట్ట పటిష్టతకు వైఎస్సార్ సీపీ నాయకులు చర్యలు తీసుకున్నారు. ఇందు కోసం మట్టిని తోలారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులతో కలసి మండల కన్వీనర్ పి. మురళీమోహన్ రెడ్డి అగసనూరు సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్ట వద్దకు చేరుకున్నారు. తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడంతో నీరంతా నదిలోకి వస్తుండటంతో పరిస్థితిని గ్రామస్తులతో కలిసి సమీక్షించారు. ఇటీవల ఆర్డీఎస్ కుడి కాల్వ పనుల కోసం చేపట్టిన కరకట్ట నీటి ఉధృతికి కొట్టుకోపోయే ప్రమాదం ఉందని గమనించారు. అగసనూరు గ్రామ ప్రజలతో కలిసి జేసీబీ ఏర్పాటు చేసి కరకట్టకు మట్టిని వేసి పటిష్టంగా ఉండే విధంగా పనులు చేయించారు. నది తీర పొలాల్లో వేసుకున్న మోటార్లు, విలువైన సామానులను భద్ర పరుచుకోవాలని రైతులకు సూచించారు. ఇందులో అగసనూరు, తుంబిగనూరు గ్రామ సర్పంచ్‌లు వడ్డే ఉలిగయ్య, వారం ఈరన్న, కురువ శేషప్ప, ఆకాష్ రెడ్డి, గ్రామ నాయకులు దేవదాసు, బసవన్న గౌడ, వడ్డే చంద్రశేఖర్, కౌడికి కగ్రెప్ప, నాగిరెడ్డి, భీమా ,యల్లాలింగ, పాలన్న, కురువ యల్లన్న, వీర భద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.